జూన్ 6న 4వ జోన్‌లో బహిరంగ వేలం నిర్వహణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 4 జోన్ లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కళ్యాణ మండపం, ఒక మార్కెట్ మరియు మెయిన్ ఆఫీ కాంటీన్ నకు జూన్ 6వ తేది ఉ.11.00 లకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరుగుతుందని 4వ జోన్ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు శుక్రవారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జీవిఎంసి 4వ జోన్ (సూర్యబాగ్) పరిధిలో గల డైన్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయము, జగదాంబ వాణిజ్య సముదాయము, పాత బస్ స్టాండ్ దుకాణాములు, పద్మనగర్ వాణిజ్య సముదాయము, సూర్యబాగ్ వాణిజ్య సముదాయము, టి.ఎస్.ఆర్ వాణిజ్య సముదాయము, కనకలదిబ్బ వాణిజ్య సముదాయము లలోని మిగిలిన దుకాణాలకు మరియు జివిఎంసి మెయిన్ ఆఫీస్ కాంటీన్, అంబేద్కర్ కళ్యాణ మండపం, రెల్లివీధి రోడ్ సైడ్ షిఫ్ మార్కెట్లును 3 సంవత్సరముల కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు జూన్ 6వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించబడునని జోనల్ కమిషనర్ తెలిపారు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు దరావత్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళలో 4వ జోనల్ కార్యాలయంలోని పర్యవేక్షకును సంప్రదించగలరని జోనల్ కమిషనర్ తెలిపారు.

ఏసీబీ చిక్కిన మహిళా డీసీటీవో

-మరో ట్రాన్స్ పోర్ట్ యజమాని

-రూ.25వేల లంచం కేసులో ఇద్దరూ అరెస్టు

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : విశాఖ జిల్లా స్టేట్ ట్యాక్స్ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ కిముదు జయలక్ష్మి 25 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయింది. హైదారాబాద్‌కు చెందిన ఇంటీరియర్ డిజైన్స్ వర్క్ వ్యాపారి అయిన విశ్వేశ్వర్ విశ్వనాథ్ ఇటీవల హైదరాబాద్ నుండి విశాఖపట్నం నకు ఫ్లేవుడ్ షీట్స్‌ను సరఫరా చేసియున్నాడు. అయితే, స్టేట్ ట్యాక్స్ డిపార్ట్ మెంట్, అచ్యుతాపురం సర్కిల్, డివిజన్ %××%, విశాఖపట్నంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేయుచున్న కిముదు జయలక్ష్మి, సదరు మెటీరియల్ ను క్యారింగ్ ఇన్వాయిస్ లేకుండా సరఫరా చేస్తున్నారని ఆరోపిస్తూ విశాఖపట్నంలో వాటిని స్వాధీన పరచుకొని, విశాఖపట్నంలోని శ్రీ కాళేశ్వరి పార్సిల్ సర్వీసు ఆఫీసులో వాటిని వుంచి, సదరు వ్యాపారిని స్వాధీనం చేసుకొన్న మెటీరియల్ మీద ఎలాంటి తదుపరి చర్య తీసుకొనకుండా, రిలీజ్ చేయడానికి గాను రూ.25,000/- లంచంగా డిమాండు చేసింది. అయితే బాధితుడు విశ్వేశ్వర విశ్వనాథ్ కు ఆ లంచం డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక విశాఖపట్నం ఎ.సి.బి అధికారులకు సదరు అధికారిణి పై ఫిర్యాదు చేసాడు. బాధితుడు డబ్బులు ఇస్తుండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు డైరెక్ట్‌గా పట్టుకున్నారు. ఇందులో భాగమైన శ్రీ కాళేశ్వరి పార్సిల్ సర్వీసు ఇంచార్జ్ అయిన మామిడిపాక సన్యాసి రాజు ను కూడా అధికారులు పట్టుకున్నారు. అరెస్టు కాబడిన ఆ ఇద్దరినీ శనివారం విశాఖపట్నంలోని ఎ.సి.బి. ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు లంచం డబ్బుల కొరకు ఎవరినైనా వేధించినట్లయితే, సంబంధిత స్థానిక ఏసీబీ అధికారులకు గాని లేదా ఏసీబీ టోల్ ఫ్రీ నెంబర్ 1064కు గాని లేదా ఏసీబీ మొబైల్ నంబర్ 94404 40057కు గాని లేదా ఏసీబీ ఈమెయిల్ complaints-acb @gov.inకి కానీ తెలియపరచవచ్చని అధికారులు ప్రజలను కోరారు.

జూలై 9న గిరిప్రదక్షిణ

ఏర్పాట్లపై ముందస్తు సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-సింహాచలం : ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో జూలై 9వ తేదీన జరిగే గిరిప్రదక్షిణ విజయవంతం చేయాలని ఈవో వేంద్ర త్రినాథరావు భక్తులకు పిలుపునిచ్చారు. స్వామివారి సింహగిరి ప్రదక్షణకు లక్షలాది మంది భక్తుల తరలివచ్చే అవకాశం ఉన్నందున సదుపాయాలకు సంబంధించి శుక్రవారం ఆలయ స్థానాచార్యులు టిపి రాజగోపాల్ ప్రధాన అర్చక(2) సీతారామా చార్యులు ఆలయం అధికారులతో కొండపైన ఆనంద నిలయంలో, ఆలయ అధికారులతో ఈఓ ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ లక్షలాది మంది భక్తులు గిరిప్రదక్షిణకు హాజరయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాల్సిన ఉందన్నారు. సింహ గిరిప్రదక్షిణ 32 కిలోమీటర్ల పొడవునా కాలినడకన నగరమంతా జరగనున్నందున సంబంధిత అన్ని విభాగాలు ఈ ఉత్సవంలో భాగస్వాములు చేసే విధంగా లెటర్స్ వ్రాయాలని తెలియజేశారు. ప్రధానంగా జీవీఎంసీ, పోలీస్, వైద్య విభాగంతోపాటు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ప్రతి ఒక్కరూ తమ వంతు చేయూతను అందుచే విధముగా చర్యలు తీసుకోవాలని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబుకు తెలియ చేశారు. సింహాచలం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల కోసం కొండ చుట్టూ స్టాల్స్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆలయ ఈవో తెలిపారు. వీటితో పాటు వివిధ ప్రాంతాల్లో మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేసేందుకు పారిశుద్ధ్యానికి సంబంధించి జీవీఎంసీ సహకారం తీసుకుంటున్నా మన్నారు. విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయంకు సంబంధించి కూడా సంబంధిత జివిఎంసి అధికారులతో చర్చలు జరుపుతున్నా మన్నారు. భక్తులకు కల్పించాల్సిన మెరుగైన ఏర్పాట్లకు సంబంధించి వివిధ డిపార్ట్మెంట్ల వారిచే. ప్రత్యేక సమన్వయ సమావేశం జరుగుతుందనీ ఈఓ తెలిపారు. కొండ దిగువన తొలి పావంచ నుంచి ప్రారంభమైన గిరిప్రదక్షిణ ఉత్సవం పాత అడవివరం, ముడసర్లోవ, హనుమంతవాక, జోడుగుల్లపాలెం ప్రాంతాల మీదుగా సింహాచలం చేరుకుంటుందని తెలియజేశారు గిరిప్రదక్షిణ ఏర్పాట్లుకు సంబంధించిన వివరాలను పోలీస్ విభాగానికి చెందిన క్రైమ్,ట్రాఫిక్ ఎసిపిలు కంచరపాలెం, గోపాలపట్నం సిఐలు ఇతర ఉన్నతాధికారులు, ఇతర విభాగాల అధికారులతో త్వరలోనే సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి చర్చిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు డిఈఓ, ఎస్. రాధా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి సహాయ కార్య నిర్వహణ అధికారులు రమణమూర్తి. ఆనంద్‌కుమార్, పిల్లా శ్రీనివాసరావు పంతం శ్రీనివాసరావు పర్యవేక్షణాధికారులు కంచి మూర్తి రాజ్యలక్ష్మి సునీల్‌కుమార్, సివివి పద్మనాభరాజు త్రిమూర్తులు, ఏఈ తాతాజీ. బంగారు రాజు, రవిరాజు లోకేష్ తిరుపతి, పిఆర్ఓ. నాయుడు సిబ్బంది హాజరయ్యారు.

విజ్ఞాన కేంద్రాలపై ప్రభుత్వ పెత్తనం

- మేధో సంపత్తికి ప్రతిబంధకం

- బిజెపి బీసీ నేత మూల వెంకటరావు

విశాలాంధ్ర-పెందుర్తి : విజ్ఞాన కేంద్రాలపై ప్రభుత్వాలు పెత్తనం మేధో సంపత్తికి ప్రతిబంధకమని బిజెపి సీనియర్ నేత బీసీ సంక్షేమ సంఘాల నాయకుడు మూల వెంకటరావు అభిప్రాయపడ్డారు. ప్రపంచానికి విజ్ఞాన సంపదను గత నాలుగు శతాబ్దాలుగా అందిస్తున్న అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీలో ఇతర దేశాల విద్యార్థులను నియంత్రించాలనడం ప్రపంచ మేధాస్సుకు భందనాలు వేయడమేనని పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నికైనప్పటికీ కీలక అధికారాలన్నీ ఒక వ్యక్తి లేక ఒక సమూహం చేతిలో కేంద్రీకృతమైతే నియంతృత్వం జడలు విప్పుకుంటుందన్న జేమ్స్ మూడీ వ్యాఖ్యలను గుర్తు చేసుకోవాలన్నారు. ప్రపంచ శక్తిగా అమెరికా ఆవిర్భవించడం వెనుక శాస్త్ర సాంకేతిక రంగాలలో అధునాతన ఆవిష్కరణలకు ఆలవాలమైన హార్వర్డ్ యూనివర్సిటీ కీలకపాత్ర పోషించిందని తెలిపారు. భౌతిక, రసాయన, వైద్య, ఆర్థిక శాస్త్రాలలో అద్భుత పరిశోధనలకు పట్టు కొమ్మగా ఉన్న ఆ యూనివర్సిటీ నుండి 160 మందికి పైగా విద్యార్థులు నోబెల్ బహుమతులు సాధించారని, మరెందరో ప్రముఖ కంపెనీలకు సీఈవోలుగా ఎదిగారన్నారు. రతన్ టాటా, మన్మోహన్ సింగ్ వంటి హార్వర్డ్ యూనివర్సిటీ పూర్వ విద్యార్థులు వారి దేశాల అభివృద్ధికి చోదకులయ్యారని చెప్పారు. హార్వర్డ్ యూనివర్సిటీ ఒక విధంగా విశ్వ మానవాళి సమిష్టి సంపద అని 140 దేశాలకు పైగా విద్యార్థులకు 100కు పైగా భాషలు బోధిస్తున్నారని వెల్లడించారు. 2023 - 24 సంవత్సరంలో పది లక్షల మంది విదేశీ విద్యార్థులు వలన 4400 కోట్ల డాలర్లకు పైగా అమెరికాకు ఆదాయం లభించిందని, 3.78 లక్షలు ఉద్యోగాలు లభించాయని తెలిపారు. హార్వర్డ్ యూనివర్సిటీలో చదువుకున్న ఎందరో మేధావులు అమెరికాలోనే స్టార్టప్ లు ప్రారంభించి ఆ దేశ ఆర్థిక అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి యూనివర్సిటీని ఇబ్బంది పెట్టడం కూర్చున్న కొమ్మను నరుక్కోవడమే అవుతుందని హెచ్చరించారు. హార్వర్డ్ తో పాటు అమెరికా యూనివర్సిటీలలో నిత్యం జరిగే పరిశోధనా ఫలాలు ప్రపంచ ప్రగతికి ఎంతగానో ఉపయోగపడతాయని, పాలకులు తమ ఆలోచనలను మార్చుకోవాలని బిజెపి నేత మూల వెంకటరావు విజ్ఞప్తి చేశారు.

90వ వార్డులో తారు రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ శంకుస్థాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ నగర అభివృద్దే ధ్యేయంగా నగర పరిధిలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీవీఎంసీ 8వ జోన్ 90 వ వార్డు పరిధిలోని లక్ష్మీ నగర్ సెయింట్ థెరిసా స్కూల్ తదితర ప్రాంతాలలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 190 లక్షలు వెచ్చించి వలుచోట్ల తారు రోడ్డు నిర్మాణం, సెంటర్ డివైడర్, కవర్ స్లాబ్, ఎం ఎస్ గిల్స్, పెయింటింగ్ మొదలైన పనులకు 90 వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వార్డును అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుచిన్నదని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధాని చేయాలన్న కృతనిత్యంతో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందన్నారు. 90వ వార్డు లక్ష్మీ నగర్ లో 15వ ఆర్థిక సంఘం నిధులు వెచ్చించి తారు రోడ్డు నిర్మాణం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపన చేశామని, అలాగే వార్డులోని ప్రజలకు అవసరమయ్యే మరిన్ని మౌలిక వసతులు కల్పనతో పాటు సంక్షేమ కార్యక్రమాలు కూడా చేపట్టడం జరుగుతుందని మేయర్ తెలిపారు. అనంతరం స్థానికంగా ఉన్న శ్రీ పార్వతి చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 8వ జోన్ జోనల్ కమిషనర్ హేమావతి, కార్య నిర్వాహక ఇంజనీరు దిలీప్, ఉపకార్య నిర్వహక ఇంజనీర్ ప్రవీణ్ ,ఏఎంఓహెచ్ అప్పలనాయుడు, ఏపీడీ చిరంజీవి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొని ఇద్దరు యువకులు మృతి

- హెల్మెట్ ధరించని యువత... - నెత్తురోడుతున్న రోడ్లు

విశాలాంధ్ర-విశాఖ క్రైమ్ : విశాఖపట్నం రోడ్లు అర్ధరాత్రి వేళల్లో ప్రమాదాలకు అడ్డాగా మారుతున్నాయి. ముఖ్యంగా హెల్మెట్ ధరించ కుండా నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న యువత, రోడ్డు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలతో లేదా ప్రాణాలు కోల్పోతున్నారు. విశాఖలో తెలుగుతల్లి ఫ్లై ఓవర్‌పై అర్ధరాత్రి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు డివైడర్ ఢీకొన్ని అక్కడక్కడే మృతి చెందడం అలాగే, ఇసుకతోట పెట్రోల్ బాంక్ జాతీయ రహదారిపై మరో వ్యక్తి మృతి లాంటి సంఘటనలు ప్రజల్లో తీవ్ర భయాందోళనలను రేకెత్తిస్తోంది.గత కొన్ని నెలలుగా విశాఖపట్నంలో రాత్రి వేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. వీటిలో అధిక శాతం ద్విచక్ర వాహనదారుల ప్రమాదాలే కావడం గమనార్హం. చాలా సందర్భాల్లో, ప్రమాదానికి గురైన యువకులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు తీవ్ర గాయాలై, ప్రాణాలు కోల్పోతున్నారు. మరికొందరు శాశ్వత అంగవైకల్యంతో జీవించాల్సి వస్తోంది. ప్రమాదాలను నివారించడానికి ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ, పరిస్థితి అదుపులోకి రావడం లేదు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపిన వారికి జరిమానాలు విధించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను విస్తృతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు. అయితే, యువతలో అవగాహన లేకపోవడం, నిర్లక్ష్యం వల్ల ఈ చర్యలు పూర్తి ఫలితాలను ఇవ్వడం లేదు.రోడ్డు ప్రమాదాలను నివారించడం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు, ఇది సమాజంలోని ప్రతి ఒక్కరి సమిష్టి బాధ్యత. యువత తల్లిదండ్రులు తమ పిల్లలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలి. పాఠశాలలు, కళాశాలలు విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై తరచుగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మీడియా కూడా ఈ విషయంలో తమ వంతు పాత్ర పోషించి, ప్రజల్లో అవగాహన పెంపొందించాలి "మీరు సురక్షితంగా ఉంటేనే, మీ కుటుంబం సురక్షితంగా ఉంటుంది" అనే నినాదాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

జూన్ 4న వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి : చిన్న శ్రీను

విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలంలో శుక్రవారం వైసీపీ పార్టీ కార్యాలయంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైసీపీ భీమిలి నియోజకవర్గం ఇన్చార్జ్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆనాడు అధికారంలో ఉన్నప్పుడు అంగ్లాలు ఎక్కలేదు అధికార దుర్వినియోగం చేయలేదు అలానే ఈరోజు అధికారం లేనప్పుడు కూడా కుంగుపోలేదు. కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు అందుబాటులో ఉండి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని అందువల్లనే ఎప్పుడు ప్రజలు నాయకులు తన వెంట ఉంటున్నారని తెలియజేశారు. అలాగే పద్మనాభం మండల కమిటీలను ఏర్పాటు చేయడం జరిగినది అదేవిధంగా జూన్ 4 జరగబోయే వెన్నుపోటు దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు సూచించడం జరిగినది. ఈ కార్యక్రమానికి వైసీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, విశాఖ జడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కె రాంబాబు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూన్ 2న ఇళ్ల స్థలాల కోసం ధర్నాలు

విశాలాంధ్ర-విశాఖ : ఇళ్ల స్థలాలపై జూన్ 2న తహాశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.మన్మధరావు, కె.క్షేత్రపాల్ విజ్ఞప్తి చేశారు. సీపీఐ పూర్ణామార్కెట్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా పోస్టర్ ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో ఇల్లు లేని పేద ప్రజలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల ముందు వాగ్దానం చేశారని తెలిపారు. మురికివాడల్లో నివాసం ఉంటున్న పేద ప్రజలు తలదాచుకునేందుకు సొంత గూడు లేక అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. జూన్ 2న తహాశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నలాల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

జూన్ 2 ధర్నా పోస్టర్ ఆవిష్కరణ : జూన్ నెల 2న తహాశీల్దార్ కార్యాలయాల వద్ద తలపెట్టిన ధర్నాల పోస్టర్‌ని సిపిఐ విశాఖ ఉత్తర నియోజకవర్గం కంచరపాలెం శాఖ ఆధ్వర్యంలో కప్పరాడ జంక్షన్ వద్ద ఆవిష్కరించారు. సీపీఐ విశాఖ జిల్లా కార్యవర్గ సభ్యులు నెయ్యల నాగభూషణరావు, కంచరపాలెం శాఖ కార్యదర్శి వాసుపల్లి నల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం శాఖ సభ్యులు సీనియర్ కామ్రేడ్ ఆడారి ఆదినారాయణ, బి.లక్ష్మి, ఉమామహేశ్వరి, సీతారత్నం, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాయి గణపతి కళాశాలలో 2025 విద్యార్థులకు బ్రిడ్జ్ కోర్స్ తరగతులు

ప్రిన్సిపాల్ ఎల్ .మహేశ్వరరావు

విశాలాంధ్ర-అనందపురం : మండలం గిడిజాల గ్రామంలో గల సాయి గణపతి పాలిటెక్నిక్, 2025 సంవత్సరంలో పాలిటెక్నిక్ లో చేరబోయే విద్యార్థులకు ఒక అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోందనీ, 10వ తరగతి వరకు చదివిన సబ్జెక్టులకు పాలిటెక్నిక్ సబ్జెక్టులను అనుసంధానిస్తూ బ్రిడ్జ్ కోర్స్ తరగతులను నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. యల్. మహేశ్వరరావు తెలిపారు. ఈ బ్రిడ్జ్ కోర్సు 2 వారాలపాటు ఉంటుందని, జూన్ 2 (సోమవారం) నుండి సాయి గణపతి పాలిటెక్నిక్‌లో ప్రారంభమవుతుందని, ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు పాలిటెక్నిక్ విద్యకు అవసరమైన పునాది పటిష్టం చేసుకోవచ్చని కళాశాల కరస్పాండెంట్ ఎస్.వేణుగోపాల్ తెలిపారు.ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులు ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేదు ఎటువంటి సర్టిఫికెట్స్ సబ్మిట్ చేయనవసరం లేదు. ఈ తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, ఎస్-కోట, భీమిలి నుంచి కాలేజీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుంది. 9581467711, 8790635885, 8142589853, 958195068 మరిన్ని వివరాలకు ఈ ఫోన్ నెంబర్లకు సంప్రదించవలసిందిగా తెలిపారు.

శాంతి, సాంస్కృతిక ఉద్యమాల సారధి-స్నేహశీలి సుకుమారన్

నేడు అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో సంస్మరణ సభ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : విశాఖ అంటే సముద్రమూ, ఆంధ్రా యూనివర్సిటీ, యారాడకొండ మదిలో మెదిలినట్టే ఇక్కడ ఏ సాంస్కృతిక కార్యక్రమం జరిగినా చటుక్కున గుర్తుకు వచ్చే పేరు టి.ఎస్. సుకుమారన్. నలుగురు కలిసి ఏసమావేశం జరుపుకున్న అతన్నొకసారి తలవాల్సిందే. అంతలా అందరికీ స్నేహపాత్రుడైన సుకుమారన్ ఒక్కసారిగా మే 20, 2025న మన అందరికీ దూరమై పోయాడు. భారత సాంస్కృతిక సహకార స్నేహ సంఘం (ఇస్కఫ్)లో దేశవ్యాప్తంగా చేస్తున్న ఎందరో నాయకులూ, కార్యకర్తల పేర్లు సుకుమారన్కు నోటికే వచ్చు. ఇస్కఫ్ దాదాపు యాభై సంవత్సరాల అనుబంధం ఆయనది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనూ, రాష్ట్రం విడిపోయిన తర్వాత ఇస్కఫ్ కార్యకలాపాల్లోనూ, నిర్మాణంలోనూ ఆయన పాత్ర ఈ సంస్థతో అనుబంధం వున్న అందరికీ చిరపరిచితం. 1954, జూన్ 11న విజయవాడలో ఏర్పడిన ఇండో సోవియట్ మిత్ర మండలి (ఇస్కస్) నుంచి సోవియట్ యూనియన్ అంతర్ధానం అయ్యాక 1993లో ఏర్పడిన ఇస్కఫ్ వరకు ఉప్పల లక్ష్మణరావు, వేములపల్లి శ్రీకృష్ణ, పద్మావతి శాస్త్రి, గూడవల్లి నాగేశ్వర రావు, పద్మావతి శాస్త్రి, కె.సుబ్బరాజు లాంటి ఎందరో ప్రముఖులు ఈ సంస్థకు రాష్ట్రంలో వన్నె తెచ్చారు. ఇప్పుడు వీరి సరసన టి. ఎస్. సుకుమారన్ పేరు కూడా ఈ శాంతి, స్నేహ, సాంస్కృతిక పయనంలో ఒక మైలురాయిగా నిలుస్తోంది. ఆయనతో కలిసి పనిచేసిన జ్ఞాపకాలు, జరిపిన కార్యక్రమాలు గురుతులు ఇంకా తడిగా పచ్చిగా బాధగా మదిలో మెదులుతూనే వున్నాయి. దాదాపు 16 రాష్ట్రాల కళాకారులను ఒక వేదిక మీదకు తీసుకువచ్చి నాలుగు సార్లు అంతర్రాష్ట్ర సాంస్కృతిక ఉత్సవాలు ఒంటి చేత్తో నిర్వహించిన కార్యదక్షుదు సుకుమారన్. కేరళ నుంచి ఉద్యోగరీత్యా విశాఖపట్నం వచ్చి మనందరితో కలిసిపోయి ఈ మట్టిలోనే కలిసిపోయిన సుకుమారన్ బహుముఖ ప్రజ్ఞాశాలి. బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల సంఘంలోనూ, భారత కమ్యూనిస్టు పార్టీ, విశాఖపట్నం లోను, విశాఖ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గాను ఆయన సేవలు అందించారు. 2025, ఏప్రిల్ 26, 27 తేదీల్లో మదనపల్లిలో జరిగిన ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభలో పాల్గొని సభల విజయవంతానికి కృషి చేసి మార్గదర్శకుడిగా నిలిచారు. ఇస్కఫ్కు ఆయన అందించిన సేవలకు రాష్ట్ర మహాసభఆయనను సత్కరించి గౌరవించింది. రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి వైదొలిగి అధ్యక్షవర్గ సభ్యులుగా ఎన్నిక అయ్యారు. చీకూ, చింతా లేని టెలికాం ఉద్యోగంతో భద్రమైన జీవితం వుండి కూడా సమాజం కోసం, మంచి భవిష్యత్తు కోసం జరిగే అన్ని పోరాటాల్లోనూ సుకుమారన్ ముందు వుండేవారు. ఆయన స్మృతులను గుర్తు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన సభకు అందరికీ ఆహ్వానం పలుకుతున్నాం. సుకుమారన్ తో కలిసి ఇస్కఫ్ మేము కలిసి పని చేసాం. ఆయన ద్వారా ఇందులోకి వచ్చి గుర్తింపు పొందాం అనే వారి ఆప్త వాక్యాలు విందాం. పలువురు మేధావులు ఆయన గురించి చెప్పే మాటలు విని నివాళి అర్పిద్దాం. తప్పక రండి.

రాష్ట్రపతి పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-విశాఖపట్టణం : జూన్ 10వ తేదీన విశాఖపట్టణంలో జరగనున్న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు రాష్ట్రపతి ద్రౌపదీముర్ము విచ్చేస్తున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం ఉదయం వీసీ టి.వి. కట్టిమణితో కలిసి వివిధ అంశాలపై సమీక్షించిన ఆయన అధికారులకు కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. జూన్ 10వ తేదీ ఉదయం 11.30 గంటలకు విశాఖపట్టణం అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకుంటారని, అక్కడ నుంచి రోడ్డు మార్గం ద్వారా బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలుకు విచ్చేస్తారని పేర్కొన్నారు. అక్కడ జరిగే కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవంలో పాల్గొంటారని చెప్పారు. 12.00 నుంచి 01.00 గంటల వరకు జరిగే కార్యక్రమ అనంతరం ఆమె రోడ్డు మార్గం ద్వారా విమానాశ్రయానికి చేరుకొని తిరుగుపయనమవుతారని వివరించారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. రోడ్డు మార్గం ద్వారా రానున్న నేపథ్యంలో సుందరీకరణ పనులు, మరమ్మతులు చేపట్టాలని చెప్పారు. జ్ఞానాపురం రేల్వే అండర్ పాస్ వద్ద నీరు నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని, ఒకవేళ వర్షం పడినట్లయితే మోటార్ల ద్వారా నీటిని తొలగించాలని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఐఎన్ఎస్ డేగా నుంచి కన్వెన్షన్ హాలు వరకు ఎలాంటి హోర్డింగులు, విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులు లేకుండా తొలగించాలని సూచించారు. ఏయూ కన్వెన్షన్ హాలు వద్ద సీటింగ్ ఏర్పాట్లు, ప్రోటకాల్ నిబంధనలు పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. రాష్ట్రపతితో పాటు, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి రానున్న క్రమంలో ప్రత్యేక గ్రీన్ రూమ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్డు మార్గంలో, ఏయూ కన్వెన్షన్ హాలు వద్ద పారిశుద్ధ్య పరమైన ఇబ్బందులు లేకుండా జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. నిపుణులతో కూడిన వైద్య బృందం, అత్యంత ఆధునిక వసతులు కలిగిన అంబులెన్స్ ను అందుబాటులో ఉంచాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వీసీ టి.వి. కట్టిమణి, డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి. శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలపై విశాఖ సిటీ పోలీస్ ఉక్కుపాదం

వేర్వేరు నేర సంఖ్యలో మరో ముగ్గురు క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న బుక్కీలని అరెస్ట్ చేసిన విశాఖపట్నం సిటీ పోలీసులు

విశాలాంధ్ర విశాఖ క్రైమ్ :క్రికెట్ బుక్కీల ఏరివేతలో భాగంగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో గాజువాక కు చెందిన ఒక బాధితుడు ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా క్రికెట్ బెట్టింగ్ ఊబిలో దింపి దానిద్వారా అమాయకులైన ప్రజల దగ్గర నుంచి డబ్బులు దండుకొని వారికి మాయ మాటలు చెప్పి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపించి వాళ్ళ దగ్గర ఉన్న డబ్బు అంత కాళీ చేసి క్రికెట్ బెట్టింగ్లకి అలవాటు చేస్తున్న విజయనగరం కు చెందిన ముఠాలోని ఇద్దరు క్రికెట్ బు క్కీలని ఇదివరకే అరెస్టు చేసిన విషయం తెలిసినదే! అయితే ఈ కేసులో ప్రధాన నేరస్తుడు కోసం గాలించగా వీరికి సహకరిస్తున్న మరో ఇద్దరు బుక్కీల అయినటువంటి విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం ఇప్పవలసకు చెందిన పెనుమజ్జి శ్రీనివాసరావు(45), విజయనగరం జిల్లా గరివిడి మండలం రేగటి అగ్రహారంకి చెందిన మోదుల అరవింద్(26) అనే వ్యక్తులు www.national999.com అనే వెబ్ సైట్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ నిర్వహించేవారు, వీరిని అరెస్ట్ చేసి రిమాండ్ కి తరలించడం జరిగింది. వీరు మరో కేసులో నేరసంఖ్య 90/2025 ప్రధాన ముద్దాయి అయినటువంటి రాయిపోదు పాలెం విలేజ్, రాంబిల్లి మండలం అనకాపల్లి జిల్లాకు చెందిన ఆదాది సురేష్ (34) క్రికెట్ బెట్టింగ్ యాప్స్ అయినటువంటి GOPIN, కింగ్ ఎక్స్చేంజ్ అనే యాప్ ల ద్వారా అమాయక ప్రజలతో క్రికెట్ బెట్టింగ్ మత్తులో దించివాడు, సాంకేతిక సహాయంతో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న క్రికెట్ బూక్కీలని చాకచక్యంగా పట్టుకొని రిమాండ్ కి తరలించడం జరిగింది. ఈ ముద్దాయిల ద్వారా మరి కొంత మంది బెట్టింగ్ నిర్వహిస్తున్న బూకీల గురుంచి సమాచారం వెలుగులోకి వచ్చింది, వారిని, బెట్టింగ్ ఆడుతున్నటువంటి జూదగాలను ప్రత్యేక బృందాల ద్వారా పట్టుకుని అరెస్టు చేశామని వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో పోలీసులు తెలిపారు, ఆన్లైన్, ఆఫ్లైన్ బెట్టింగ్లలో మీకు తక్కువ డబ్బుల పెట్టుబడికి ఎక్కువలాభాలు వస్తాయని ప్రజలకు ఆశ చూపించి లక్షల రూపాయలు కొల్లగొట్టడం జరుగుతుంది. అందువలన ప్రజలెవరు కూడా బెట్టింగ్ గేమ్స్ జోలికి వెళ్ళకుండా ఉండాలని మనవి మరియు ఎవరైనా ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ బెట్టింగ్ నిర్వహించిన, నిర్వహిస్తున్న వారికి సహకరించిన, లేదా మీరు బెట్టింగ్ లో పాల్గున్న మీ పై చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని దీనిపై నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చని ,సైబర్ క్రైమ్ పిర్యాదుల కొరకు సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.in, లేదా టోల్ ఫ్రీ నెంబర్: 1930 లేదా కమిషనర్ ఆఫ్ పోలీస్: 7995095799 వారికి కాల్ చేసి ఫిర్యాదు చేయగలరని ప్రజలను పోలీసులు కోరారు.

స్థలం ఆక్రమించి అనధికార నిర్మాణంపై కలెక్టర్‌కు పిర్యాదు

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : అనధికార నిర్మాణం గురించి స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు .మాధవధార లోని తమ ఇంటిని ఆనుకుని ఉన్న 120 గజాల స్థలంలో బిల్డర్ గ్రూప్ హౌస్ నిర్మిస్తున్నారు. అయితే మా స్థలాన్ని ఆక్రమించి సెట్ బాక్స్ ఏమి వదలకుండానే మీరు చేయడం పట్ల పొరిగింటివారైనా మూల సన్యాసిరావు కలెక్టరేట్‌లోని ప్రజా పరిష్కార వేదికలో కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. వెంటనే చర్య తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదివరకే జీవీఎంసీలు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బిల్డర్ యధావిధిగా నిర్మాణం చేపడుతున్నాడు. మాధవధార, ఇంటి నెంబర్ : 39-20-62/1, లో నివాసముంటున్నానని, నా పొరుగు ఇంటి వాడు జీవీఎంసీ నిబంధనలు ఉల్లంఘిస్తూ నిర్మాణ పనులు చేపడుతున్నారు. పది అడుగుల రోడ్లో సెట్ బాక్స్ లేకుండా నాలుగు అంతస్తులు నిర్మించడానికి యధావిధిగా పనులు జరుగుతున్నాయి. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలుస్తుంది. ఆ స్థలం ముందు బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. సరైన అనుమతులు లేకుండా నిర్మాణం కొనసాగిస్తున్నాడు.ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నేను అనధికార నిర్మాణం గురించి బిల్డర్‌ని ప్రశ్నించినప్పుడు, నాకు జీవీఎంసీ, సచివాలయం సిబ్బంది కూడా సహాయం ఉందని, నిబంధనలు పాటించకపోయినా, ఫిర్యాదుల గురించి పట్టించుకోరని, సమాధానం ఇచ్చాడు. ఈ రకమైన వైఖరి, నిబంధనలు పాటించే నావంటి పౌరులకు చాలా ఆందోళన కలిగిస్తోందని శ్యామలరావు మీడియా కు వెల్లడించారు.

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా పోటీలు

విశాలాంధ్ర-తగరపువలస : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిట్టివలసలో ఆయస్ డిపార్ట్మెంట్‌కి చెందిన డాక్టర్ ప్రతిభ,పిడి సిహెచ్ వెంకటరెడ్డి, సిఆర్ఎంటి త్రినాథ్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీల్లో జూనియర్స్ విభాగంలో యోగ క్విజ్ విజేతలుగాఎస్. వర్షిత పి.తన్మయి, ఆర్షిత్‌సాయి. బి.భవదీప్ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎన్ సూర్యనారాయణ, కె.భాస్కరరావు పి.నాగేశ్వరరావు, కె.జగన్నాథం, పి.జయంత్ కుమార్, రాంప్రసాద్ ఆనంద్ సమగ్ర శిక్ష పిటిఐలు మేరీ గోల్డ్, పద్మావతి, స్కూల్ యాజమాన్యం కమిటీ సభ్యులు మరియు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏ అంతరాయం లేకుండా యోగా డే నిర్వహించాలి : కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : జూన్ 21న విశాఖపట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనే ప్రజలు ఆయా వేదిక వద్దకు సులభంగా చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ అంతరాయం, పార్కింగ్ ఇబ్బందులు లేకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఆ రోజు కాళీమాత టెంపుల్ నుంచి భీమిలి వరకు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసే వేదికలతో పాటు, అనువైన ప్రాంతాల్లో మరొక 25 అదనపు వేదికలు ఏర్పాటు చేస్తున్నామని అక్కడ అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తూ పక్కా ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. ఏ ప్రాంతం వారు ఏ కంపార్ట్మెంట్‌కు చేరుకోవాలి. ఏ వాహనం ఎక్కడికి చేరుకోవాలి అనే అంశాలపై అందరికీ అవగాహన ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రధాన వేదికతో పాటు ఎంజీఎం గ్రౌండ్, వీఎంఆర్డీఏ పార్కు, అప్పూఘర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్, విశాఖ వ్యాలీ రోడ్డు, రుషికొండ, గీతం కళాశాల, సాయిప్రియ రిసార్ట్సు, ప్రేమ సమాజం, రామానాయుడు స్టూడియో కింది భాగంలో, కాపులుప్పాడ, చేపలుప్పాడ, భీమిలి హౌసింగ్ బోర్డు లేఅవుట్లో, ఐఎన్ఎస్ కళింగ సమీపంలోని మైదానంలో యోగాసనాలు వేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లోని కార్యక్రమాలను ప్రధాన కార్యక్రమానికి అనుసంధానం చేస్తూ ప్రజలను భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు.

సుందరీకరణ, మరమ్మతులు, లెవెలింగ్ పనులు వేగంగా చేపట్టాలి : కాళీమాత ఆలయం నుంచి భీమిలి డబుల్ రోడ్డు వరకు నిర్వహించే ప్రధాన వేదిక గూండా సుందరీకరణ పనులు, మరమ్మతులు చేపట్టాలని, విద్యుదీకరణ చేయాలని, రోడ్డు మధ్యలో ఇబ్బందికరంగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్ల మధ్యలో ఉండే డివైడర్లకు, పక్కన ఉండే గోడలకు చిత్రాలతో కూడిన రంగులు వేయాలని సూచించారు. మత్స్యదర్శినికి రంగులు వేయాలని, ఆ పక్కనే పాడు పడిన భవంతిని గ్రీన్ మాటీతో కవర్ చేయాలని చెప్పారు. రోడ్లకు ఇరువైపులా ఉండే డ్రెయిన్లను శుభ్రపరచాలని, అవసరమైన చోట

మరమ్మతులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లో విద్యుదీకరణ, టాయిలెట్లు, తాగునీరు, హెల్ప్ కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిని హోర్డింగులు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. పవర్ సప్లై, ఇంటర్ నెట్ సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పార్కింగ్ ప్రదేశాలను ముందుగానే చదును చేసుకోవాలని, మొక్కలు తొలగించాలని సూచించారు. డీసీపీలు అజిత, మేరీ ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, ఆర్డీవోలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.99కి ప్రారంభంతో అమేజాన్ బజార్ ప్రయాణ అవసరాలతో స్మార్ట్ ట్రావెల్ ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం : రూ. 99కి ప్రారంభంతో అమేజాన్ బజార్ ప్రయాణ అవసరాలతో స్మార్ట్ ట్రావెల్ ప్రారంభం రూ. 150 వరకు క్యాష్ బాక్ ఆనందించండి, సండే బజార్ లో 80% వరకు ఆదా చేయండి, ఉచిత డెలివరీ మరియు 5 రోజుల ఇబ్బంది లేని రిటర్న్స్ పొందండి ఈ వేసవి, ఎక్కువ ఖర్చు చేయడం కాదు, ఎక్కువ అనుభవించడం గురించి. తక్షణమే బీచ్ లకు పరుగులు తీయడం నుండి నును లేత ఎండలో ట్రెక్కింగ్ చేయడం వరకు ప్రయాణికులు భారీ బ్యాగ్ లతో ప్రయాణాలకు సిద్ధంగా ఉన్నారు. లీక్-ప్రూఫ్ బాటిల్స్, ఇన్ ఫ్లేటబుల్ నెక్ పిల్లోస్, మరియు తెలివైన ప్రయాణ వ్యూహాలు వరకు గొప్ప డీల్స్ ను అమేజాన్ బజార్ అందచేస్తోంది. రూ. 599 లోపు వావ్ అద్భుతమైన ఉత్పత్తుల కోసం భారతదేశం ఎంచుకునే వేదిక అమేజాన్ బజార్ పై అత్యంత సరసమైన ఎంపికను తనిఖీ చేయండి.మరి మీరు మీ తరువాతి వెకేషన్ కోసం ప్రణాళిక చేస్తే, మరియు బహుళ ప్రయాణ ఉత్పత్తుల పై కొన్ని ఆకర్షణీయమైన డీల్స్ కోసం అన్వేషిస్తుంటే, ఇంక ఆలోచించవద్దు, అమేజాన్ బజాక్ మీరు కోరుకున్న అన్నింటినీ అందిస్తుంది. అన్వేషించడానికి సిద్ధంగా ఉన్నారా? తెలివైన ప్యాకింగ్ కు పెద్ద బడ్జెట్ అవసరం లేదని నిరూపించే ప్రముఖ ప్రయాణ ఎంపికలు:

నోటి క్యాన్సర్‌ను గుర్తించడం కోసం ఓరల్ లైఫ్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించిన అపోలో క్యాన్సర్ సెంటర్స్

విశాలాంధ్ర-విశాఖపట్నం : పొగాకు వినియోగమనేది ఇకపై ఎంత మాత్రమూ వ్యక్తిగత అలవాటు కాదు. ఇది జాతీయ ఆరోగ్య సంక్షోభం. ప్రపంచ వ్యాప్తంగా బయట పడుతున్న నోటి క్యాన్సర్ కేసుల్లో దాదాపు మూడింట ఒక వంతు భారతదేశం లోనే కనిపిస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఇక్కడ 77,000 కొత్త కేసులు బయట పడుతుండగా 52,000 మరణాలు సంభవిస్తున్నాయి. ఈ క్యాన్సర్ ల బారిన పడిన వారిలో మనుగడ రేటు కేవలం 50 శాతం వద్ద ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇది చాలా తక్కువ. గృహ వినియోగ వ్యయ సర్వే (2022-23) ద్వారా చెప్పబడినట్లుగా, పట్టణ , గ్రామీణ భారతదేశంలో పెరుగుతున్న పొగాకు వినియోగం, ఈ ఆందోళనకరమైన ధోరణిని మరింత తీవ్రతరం చేస్తోంది, పాన్, పొగాకు మరియు ఇతర మత్తు పదార్థాలపై ఖర్చు పెరిగినట్లు గృహ వినియోగ వ్యయ సర్వే వెల్లడించింది. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, అపోలో క్యాన్సర్ సెంటర్స్ (ఏసిసి) నోటి క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడంపై దృష్టి సారించి ఓరల్ లైఫ్ పేరిట వేగవంతమైన పరీక్షా కార్యక్రమం ను ప్రారంభించింది. ప్రజలలో అవగాహన కల్పించటం, తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవటం మరియు ముఖ్యంగా పొగాకు వినియోగదారులు, మద్యం వినియోగదారులు, హెచ్‌పివి -16ఇన్ఫెక్షన్ ఉన్నవారు , ముందుగా నోటి గాయాలు ఉన్న వ్యక్తులతో సహా అధికంగా ఈ ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్న వ్యక్తులను ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుందని అపోలో క్యాన్సర్ సెంటర్ వద్ద మెడికల్ ఆంకాలజిస్టున్సల్టెంట్ డాక్టర్ ప్రదీప్ వెంట్రపాటి అన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్&నెక్ సర్జికల్ ఆంకాలజీ కన్సల్టెంట్ డాక్టర్ ధీరజ్ కొండమూడి, క్యాన్సర్ సెంటర్ యూనిట్ హెడ్ రామచంద్ర.జె లతోపాటు ఇతర వైద్యులు పాల్గొన్నారు.

నైజీరియాలో పెట్టుబడి అవకాశాలపై గీతంలో సమావేశం

విశాలాంధ్ర-మధురావాడ : ఆఫ్రికాలోని నైజీరియాలో 34 ఏళ్ల క్రితం ఏర్పడిన జిగావా రాష్ట్రంలో భారతీయులకు గల పెట్టుబడి అవకాశాలను తెలియజేసేందుకు ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ లో శుక్రవారం తేది.30.05.2025న పెట్టుబడిదారుల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిగావా రాష్ట్ర గవర్నర్ మల్లం ఉమర్ నమాది నాయకత్వం వహించారు. ఆయన తన ఉన్నత స్థాయి బృందంతో ముఖ్యంగా నైజీరియా వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన సీనియర్ అధికారులు, జిగావా రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, ఫార్మర్స్ అండ్ హర్డ్స్‌మెన్ మేనేజ్‌మెంట్ బోర్డు చెందిన సాంకేతిక నిపుణులతో కలసి జిగావా వ్యవసాయాభివృద్ధి మరియు అంతర్జాతీయ సహకారంపై తమ రాష్ట్రంలోగల పెట్టుబడి అవకాశాలను వివరించారు. పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలు మరియు అకాడమిక్ ప్రముఖుల సమక్షంలో గవర్నర్ మల్లం ఉమర్ నమాది మాట్లాడుతూ, వ్యవసాయ పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణాన్ని రూపొందించేందుకు తమ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యూహాత్మక చర్యలను వివరించారు. జిగావా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోందని, వ్యవసాయ మరియు వాణిజ్యం, ఎగుమతులను సులభతరం చేసే విధానాలను అమలు చేస్తోందని గవర్నర్ పేర్కొన్నారు.ఎగుమతి ప్రోత్సాహక వ్యూహం మరియు సంపూర్ణ అభివృద్ధి విధానం వంటి నూతన విధానాలు నైజీరియా జాతీయ అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా రూపొందించబడ్డాయని ఆయన వివరించారు. విదేశీ పెట్టుబడిదారులకు అందిస్తున్న ప్రోత్సాహాలను వివరిస్తూ వ్యవసాయ రంగ పెట్టుబడులకు పన్ను రాయితీలు,వ్యవసాయ అవసరాల కోసం భూమి కేటాయింపు, వ్యవహార లైసెన్సింగ్, కంపెనీ రిజిస్ట్రేషన్ ప్రక్రియల సరళీకరణ, నవీకరించిన జిగావా వ్యవసాయ విధానంకు అనుగుణంగా పాలసీలు తెలియజేశారు. ఈ సమావేశానికి గీతం ప్రో వైస్-చాన్సలర్ ప్రొఫెసర్ వై. గౌతమ రావు అధ్యక్షత వహించారు. "జిగావా ఆర్థిక వ్యవస్థ వ్యవసాయాధారితమైనదిగా ఉందని, ఆ రాష్ట్ర జీడీపీలో 60% పైగా వ్యవసాయమేనని, ప్రజల స్నేహపూర్వకంగా ఉంటారని తెలిపారు. ఎగుమతి అనుకూలమైన పంటలు నువ్వులు, వేరుశెనగ, బియ్యం, గోధుమ వంటి వాటితో జిగావా భారతీయ వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు బలమైన అవకాశాన్ని అందిస్తోందని అని ఆయన అన్నారు. జిగావా రాష్ట్రంలో ఒక డెయిరీ స్టార్టప్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్న భారతీయ పారిశ్రామిక వేత్త చంద్రశేఖర్ మాట్లాడుతూ సుమారు 200 భారతీయ కంపెనీలు నైజీరియాలో వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టి స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నాయని, ఇటీవలి ద్వైపాక్షిక ఒప్పందాలు భారత-నైజీరియా పెట్టుబడులను మరింత పెంచుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు గీతం ఇంటర్నేషనల్ స్టూడెంట్ వ్యవహారాల డైరెక్టర్ డాక్టర్ కె.పి.కిషన్, పీసీసీఐఎఫ్ మహిళా విభాగం అధ్యక్షురాలు డా. యర్లగడ్డ గీత, వైస్ ఛైర్‌పర్సన్ లీలారాణి, గీతం బిజినెస్ స్కూల్ ఫ్యాకల్టీ సభ్యులు, నగరానికి చెందిన పలువురు పెట్టుబడిదారులు మరియు పరిశ్రమల ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నారు.

కూటమి సర్కార్ ఫలితమే మహానాడు సక్సెస్

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-భీమిలి : రాష్ట్రంలో కూటమి సర్కార్ పనితీరుకు నిదర్శనమే కడపలో తెలుగుదేశం చేపట్టిన మహానాడు విజయోత్సవానికి నాంది అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. తెలుగుదేశం పార్టీ హయాంలో కడపలో మూడురోజులుగా చేపట్టిన మహానాడు ఊహించనటువంటి సక్సెస్‌పై రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు స్పందించారు. కూటమి సర్కార్ సారధులు మోదీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సారద్యంలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని, కూటమి సర్కార్ పనితీరుకు నిదర్శనమే మహానాడు సక్సెస్ అని అన్నారు. ఊహకు అందని జనసందోహం, ఉత్సాహం, కార్యకర్తల కేరింతలు, స్వచ్ఛందంగా తరలివచ్చిన అశేష జనసందోహంతో కడపలో పండగ వాతావరణంను తలపించిందని అన్నారు. 11నెలల క్రితం రాష్ట్రంలో అధికారం చేపట్టిన చంద్రబాబు సర్కార్ మార్క్ పాలిటిక్స్‌తో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చేసుకొని పాలన సాగిస్తున్నారని అన్నారు. గత వైసిపీ విధ్వ%శ%సక పాలన నుండి ప్రజా సంక్షేమ పాలన వైపు చంద్రబాబు సర్కార్ ప్రయాణం చేస్తుందన్నారు. ఒకప్పుడు రాయలసీమ అంటే ఫ్యాక్షనిజం అనేవారని కానీ నేడు కూటమి సర్కార్ రాకతో ప్రేమకు, ఆప్యాయతకు నిదర్శనంగా మారిందని అన్నారు. రాళ్ళ సీమ నుండి రతనాల సీమవైపు అడుగులు వేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలను సమాంతరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్న కూటమి సర్కార్ కు ప్రజలు జేజేలు చెప్పకుండా ఉండలేరని అన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సారద్యంలో రాష్ట్రం అభివృద్ధి పదంవైపు పయనిస్తుందని, వీరి కలయిక దశబ్దాలపాటు ఇలానే ఉండాలని మనస్ఫూర్తిగా దేవుని ప్రార్థిస్తున్నామని గంటా నూకరాజు అన్నారు.

షైన్స్’ని విడుదల చేసిన ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రముఖ ఫుడ్ విభాగ ఉత్పత్తుల సంస్థ ఐటీసీ సన్‌ఫీస్ట్ మామ్స్ మ్యాజిక్, తమ మామ్స్ మ్యాజిక్ షైన్స్ షైనీ బటర్ (వెన్న) కుకీని విడుదల చేసింది. ఇది బటర్ కుకీ ప్రియులకు ఆనందకరమైన కొత్త అనుభవాన్ని అందిస్తామనే వాగ్దానం చేస్తోంది. ఒక తల్లి తన బిడ్డలో ప్రతిభను బయటకు తీసుకువచ్చినట్లే, ఈ కరకరలాడే , వెన్నతో కూడిన కుకీని సున్నితమైన చక్కెర గ్లేజింగ్ ద్వారా ప్రత్యేకంగా తయారు చేశారు. ఇది కుకీ యొక్క మెరుపును సజీవంగా తెస్తుంది. దీని కోసం, మామ్స్ మ్యాజిక్ నదియా మొయిదుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కొత్త టీవీసీ ని విడుదల చేసింది, ఇది దాని తాజా ఆవిష్కరణ గురించి వెల్లడిస్తుంది. రుచి, ఆకృతిని పెంచే ప్రత్యేకమైన మెరిసే చక్కెర గ్లేజింగ్‌తో రూపొందించబడిన, ఈ కుకీలోనోరూరించే వెన్న నింపబడింది, కుకీ కొరికిన ప్రతిసారీ మహోన్నతమైన మరియు సంతృప్తికరమైన రుచిని అందిస్తుంది. దీనిలోని కరకరలాడే ఎనిమిది పొరలు ఒక ప్రత్యేకమైన, నోటిలో కరిగిపోయే అనుభవాన్ని సృష్టిస్తాయి, అసమానమైన ట్రీట్‌గా మారుస్తాయి. రోజువారీ స్నాక్స్ అనుభవాన్ని షైన్స్ మెరుగుపరుస్తుంది, ఇది పగటిపూట తినడానికి, టీ-టైమ్ క్షణాలను ఆస్వాదించటానికి సరైన అనుబంధంగా మారుస్తుంది. మామ్స్ మ్యాజిక్ ఒక టీవీసీని విడుదల చేసింది, ఇది తన బిడ్డ ఎదుగుదలలో ఒక తల్లి యొక్క తిరుగులేని మద్దతు యొక్క సారాంశాన్ని అందంగా ఒడిసిపడుతుంది. ఈ చిత్రంలో, నదియా మొయిదు ఒక తల్లి పాత్రను పోషించారు. ఆమె క్రంచీ బటర్ కుకీపై సున్నితమైన చక్కెర గ్లేజింగ్‌ను వర్తింపజేయడం వల్ల దానిలోని మెరుపు ఎలా బయటపడుతుందో అందముగా తెలియజేస్తారు. అదేవిధంగా, చెన్నైలో చెస్ శిక్షణ పొందాలనే తన కుమార్తె కలను నెరవేర్చడానికి మద్దతు ఇవ్వడం, దానికోసం తమ మామగారిని సున్నితంగా ఒప్పించడం, తద్వారా ఆమె తన బిడ్డ సామర్థ్యాన్ని వెలికి తీసుకురావటానికి కృషి చేయటం దీనిలో కనిపిస్తుంది. తమ పిల్లలలోని ఉత్తమతను బయటకు తీసుకురావడానికి అదనపు కృషి చేసే తల్లులకు ఈ టీవీసీ ఒక నివాళి అని ఈ ఆవిష్కరణ సందర్భంగా ఐటీసీ లిమిటెడ్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ తెలిపారు.

జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 16 వినతులు

జీవీఎంసీ ఛీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కి సంబంధించి 16 వినతులు వచ్చాయని జీవీఎంసీ ఛీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం లోని సమావేశ మందిరం లో సిపి లు, డీసీపీలు, ఏసీపీలుతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఛీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న %ూ+=ా% కార్యక్రమం లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, ప్రతి శుక్రవారం జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించేందుకు గానూ ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఛీఫ్ సిటీ ప్లానరు అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి జివిఎంసి కి సంబంధించి 16 వినతులు వచ్చాయని, అందులో ముఖ్యంగా 1వ జోన్ కు 01, 2వ జోన్ కు 01, 3వ జోన్ కు 01, 4వ జోన్ కు 02, 5వ జోన్ కు 09, 7వ జోన్ కు 02 వినతులు వచ్చాయని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ప్రజలు పట్టణ ప్రణాళిక విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం నమోదుచేసుకోవచ్చునన్నారు. వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలన్నారు.

ప్రతిష్టాత్మక వరల్డ్ విస్కీస్ అవార్డ్స్ 2025లో ప్రశంసలు అందుకున్న బకార్డి

విశాలాంధ్ర-విశాఖపట్నం : బకార్డి యొక్క మొట్టమొదటి మేడ్-ఇన్-ఇండియా ప్రీమియం విస్కీ అయిన లెగసి, ప్రతిష్టాత్మక వరల్డ్ విస్కీస్ అవార్డ్స్ 2025లో బ్లెండెడ్ విస్కీ విభాగంలో గోల్డ్‌ని అందుకుంది. ఈ గుర్తింపుతో , ప్రపంచ గుర్తింపును పొందిన భారతదేశం యొక్క సరికొత్త ప్రీమియం వ్యక్తీకరణగాలెగసి మారింది. సొగసైన, సమకాలీనమైన , నైపుణ్యంతో రూపొందించబడిన లెగసి కేవలం ఒక కొత్త విస్కీ కాదు - ఇది ఆధునిక భారతీయ అధునాతనత మరియు ప్రపంచ ఆకాంక్షను ప్రతిబింబించే జీవనశైలి ప్రకటన భారతదేశంలో రాజీలేని నాణ్యతతో రూపొందించబడిన లెగసి, భారతీయ మరియు స్కాటిష్మాల్ట్‌ల యొక్క విలక్షణమైన మిశ్రమం. ఈ అవార్డులు లెగసిని ప్రపంచ పటంలో ఉంచడమే కాకుండా, ప్రీమియం విస్కీ తయారీ ప్రపంచంలో బకార్డి యొక్క ప్రభావాన్ని కూడా నొక్కి చెబుతున్నాయి. మూడు సంవత్సరాల కిందట విడుదల చేయబడిన లెగసి , ప్రీమియం విస్కీ విభాగంలో ముందంజలో వుంది. ప్రపంచ విస్కీ అవార్డులు స్పిరిట్స్ ప్రపంచంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన అవార్డులలో ఒకటి. ఈ ప్లాట్‌ఫామ్‌లో గోల్డ్ అవార్డు అనేది శ్రేష్ఠతకు నిజమైన నిదర్శనం. ఈ విజయం ది డ్రింక్స్ బిజినెస్ ఆసియా నిర్వహించిన ఆసియా స్పిరిట్స్ మాస్టర్స్ 2025లో రజతం ద్వారా సమున్నతం చేయబడింది. "వరల్డ్ విస్కీస్ అవార్డ్స్ 2025లో లెగసి బంగారు పతకం మరియు ఆసియా స్పిరిట్స్ మాస్టర్స్ 2025లో రజతం గెలుచుకోవడం పట్ల మేము చాలా సంతోషంగా వున్నాము. ఈ గుర్తింపు భారతీయ వారసత్వంలో ధైర్యంగా, విలక్షణంగా మరియు లోతుగా పాతుకుపోయిన ప్రపంచ స్థాయి స్పిరిట్‌లను రూపొందించడంలో మా నిబద్ధతకు శక్తివంతమైన ధృవీకరణ" అని అన్నారు.

విచ్చలవిడిగా మందుల వాడకం, ముఖ్యంగా యాంటీ బయోటిక్స్, ఆరోగ్యానికి ప్రమాదకరం

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకూ మందులు వాడటం అనేది అంత శ్రేయస్కరం కాదని లయన్స్ క్యాన్సర్ జనరల్ ఆసుపత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వి ఉమామహేశ్వరరావు తెలిపారు. మందులు వాడకం అనేది ఇప్పుడు మన దేశంలో ఒక సాధారణ విషయంగా మారిపోయింది. ప్రపంచవ్యాప్తంగా విచ్చలవిడిగా మందులు వాడుతున్న దేశాల్లో భారత్ ప్రథమస్థానంలో ఉన్నది. ప్రజలలో సరైన అవగాహన లేక, తేలికపాటి జలుబు, దగ్గు, జ్వరానికి కూడా డాక్టర్ల సలహా లేకుండా మందులు వాడటం అలవాటు గా మారింది. యాంటి బయోటిక్స్ వినియోగంలో భారత్ ఐదో స్థానంలో ఉందన్నారు. ఈ మందులను అవసరమైతేనే వాడాలని వైద్యులు హెచ్చరిస్తున్నా, సాధారణ ఇన్ఫెక్షన్లకూ ఈ మందుల వాడకం పెరిగిపోవడం శరీరంలో వాటిపై రోగ నిరోధకత పెరిగేలా చేస్తోంది. దీని ప్రభావంగా, భవిష్య త్తులో తీవ్రమైన వ్యాధులొస్తే, యాంటీ బయోటిక్స్ పనిచేయకుండా ప్రమాదాన్ని పెంచుతోందన్నారు. దీనివల్ల మూత్రపిండాలు, కాలేయం దెబ్బతినే ప్రమాదం, అల్సర్లు, రక్తస్రావాలు వంటి అనర్థాలు సంభవిస్తున్నాయి. ఔషధ విక్రయాల నిర్వహణలోనూ నిర్ల క్ష్యాలు పెరిగిపోతున్నాయి. పలు మందుల షాపులు ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్నాయి. షెడ్యూల్ హెచ్ కిందకు వచ్చే మందులు కూడా విరివిగా అందుబాటులో ఉన్నాయన్నారు. దేశవ్యాప్తంగా నకిలీ మందుల తయారీ, విక్రయం, అలాగే నకిలీ డాక్టర్ల హవా ప్రజల ఆరోగ్యాన్ని ముప్పుపెట్టుతోంది. గ్రామాల్లో 'ఆర్ఎంపీ' లుగా వ్యవహరిస్తూ, డాక్టర్ గౌరవంతో క్లినిక్లు నడుపుతూ, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం, భారతదేశంలో సంవత్సరానికి సగటున రెండు లక్షల మంది నకిలీ వైద్యుల చేతిలో చికిత్స పొందుతూ ప్రాణాపాయంలో పడుతున్నారు. ప్రజలు ఎక్కువగా ఔషధ నియంత్రణ సంస్థల ఆమోదం లేని యాంటీ బయోటిక్స్ వాడుతున్నారన్నారు. యాంటీ బయోటిక్స్ విచ్చలవిడిగా వాడడం వల్ల శరీరంలో మంచిచేసే బ్యాక్టీరియాలు కూడా నశించిపోతాయి. దీని వల్ల రోగనిరోధక శక్తి తీవ్రంగా దెబ్బతింటుంది. మితిమీరిన మందుల వాడకం శరీరాన్ని సహజ స్వభావం నుంచి దూరం చేస్తోంది. సాధారణంగా వచ్చే తేలికపాటి సమస్యలకు వెంటనే టాబ్లెట్ వేసుకునే అలవాటు వదిలిపెట్టి కనీసం 12 గంటలు సహజ చికిత్సా మార్గాలు పాటించి, అవసరమైనప్పుడు మాత్రమే వైద్యుల సూచన మేరకు మందులను వాడాలి. ప్రత్యామ్నాయ సహజసిద్ధమైన చికిత్సా మార్గాల ద్వారా మందుల వినియోగాన్ని తగ్గించి, శరీరంలో సహజ రోగ నిరోధక శక్తిని మెరుగుపరచవచ్చు. ప్రజలలో మందుల వినియోగంపై సరైన అవగాహన కల్పించడంతో పాటు, ఆరోగ్య నిబంధనల అమలులో నియంత్రణ సంస్థలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం సముచితం. వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడుతూ ఆరోగ్యంగా జీవనాన్ని కొనసాగించండి అని పిలుపునిచ్చారు.

గణనీయ స్థాయిలో పెరిగిన ఇఫ్కో నానో ఎరువుల అమ్మకాలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : ప్రపంచ నంబర్ 1 సహకార సంస్థ, ఇఫ్కో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ పన్నుల కు ముందు(పీబీటీ) రూ. 3,811 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. దీనితో పాటు నానో ఎరువుల అమ్మకాలు 47 శాతం పెరిగినట్లు నివేదించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-2024)లో అమ్ముడైన 248.95 లక్షల బాటిళ్లతో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరం (2024-2025) 365.09 లక్షల నానో-ఎరువుల బాటిళ్లు అమ్ముడయ్యాయి. ఇఫ్కో 24-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 41,244 కోట్ల టర్నోవర్‌ను నమోదు చేసింది. ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘాని మీడియాతో మాట్లాడుతూ, ఇఫ్కో యొక్క అద్భుతమైన వృద్ధి గణాంకాలు "సహకార సే సమృద్ధి" కలను సాకారం చేసుకోవడం దేశంలోని మొత్తం సహకార రంగానికి గర్వకారణమని అన్నారు. ఆయనే మాట్లాడుతూ సొసైటీ వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల్లో రూ. 3000 కోట్లకు పైగా లాభాన్ని నమోదు చేసిందని ఆయన తెలియజేశారు. గత 23 సంవత్సరాలుగా, ఇఫ్కో తన సభ్యులకు పెయిడ్ అప్ షేర్ కాపిటల్‌పై 20 శాతం డివిడెండ్‌ను అందించిందని, సమానమైన మరియు స్థిరమైన వృద్ధికి దాని అంకితభావం , నిబద్ధతను ఇది వెల్లడిస్తోందని ఆయన అన్నారు. కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ మద్దతుతో, నానో-ఎరువులు సొసైటీకి కీలకమైన కేంద్రంగా ఉన్నాయి. విస్తృతమైన అవగాహన ప్రచారాలు, పరిశోధనలు సొసైటీ రైతులలో ఉత్పత్తుల ఆమోదాన్ని పెంచడంలో సహాయపడ్డాయన్నారు. అమ్ముడైన 365 లక్షల బాటిళ్లలో, 268 లక్షల బాటిళ్లు ఇఫ్కో నానో యూరియా ప్లస్ (లిక్విడ్) మరియు 97 లక్షల బాటిళు ఇఫ్కో నానో డిఎపి (లిక్విడ్) 2024-25 ఆర్థిక సంవత్సరంలో అమ్ముడయ్యా యన్నారు. ఇఫ్కో నానో యూరియా ప్లస్ (లిక్విడ్) అమ్మకాలు 31 శాతం మరియు ఇఫ్కో నానో డిఎపి (లిక్విడ్) 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 118% ఎక్కువ. ఈ అమ్మకాల పరిమాణం 12 లక్షల మెట్రిక్ టన్నుల సంప్రదాయ యూరియా మరియు 4.85 మెట్రిక్ టన్నుల సంప్రదాయ డిఏపి కి సమానం. ఇఫ్కో యొక్క డబ్ల్యు ఎస్ ఎఫ్ /స్పెషాలిటీ ఎరువులు/సాగరిక గ్రాన్యూల్ ఎరువులు 1.92 లక్షల మెట్రిక్ టన్నుల అమ్మకాలను సాధించాయిని చెప్పారు. డబ్ల్యు ఎస్ ఎఫ్/స్పెషాలిటీ ఎరువుల అమ్మకం 1.30 లక్షల మెట్రిక్ టన్నులు , ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 2 శాతం ఎక్కువ. సాగరిక లిక్విడ్ అమ్మకాలు 11.55 లక్షల లీటర్లు, ఇది 33% ఎక్కువ, సాగరిక గ్రాన్యూల్ 68,000 మెట్రిక్ టన్నులు, ఇది 28 శాతం ఎక్కువ మరియు బయో-ఎరువులు 8.61 లక్షల లీటర్లు, ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే 35 శాతం ఎక్కువ అని ఇఫ్కో ఎండి డాక్టర్ యు.ఎస్. అవస్థి అన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలను ఇవ్వాలి

విశాలాంధ్ర మల్కాపురం : అర్హులైన ప్రతి ఒక్కరికి సిటీలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను తక్షణమే ఇచ్చి అద్దె బారాల నుంచి విముక్తి కలిగించాలని సిపిఐ పార్టీ పశ్చిమ నియోజకవర్గం నాయకులు కాంద్రేకల సత్యాంజనేయ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జివిఎంసి పరిధి 40 వ వార్డు మరియు 63వ వార్డు లలో ఏకేసి కాలనీ మరియు కాకరలోయ కాలనీ మరియు చింతల లోయ మరియు క్రాంతి నగర్ ఏరియాలలో ర్యాలీ చేయడం జరిగింది అనంతరం మాట్లాడుతూ సకాలంలో టిట్కో ఇల్లులు చేసి పేద ప్రజలకు పూర్తి రుణమాఫీతో అర్హులైన వారికి అందజేయాలి లేని ఎడల సిపిఐ పార్టీ రాష్ట్ర సమితి పిలుపుమేరకు 2025 జూన్ 2వ తేదీన మొలగాడ మండల కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గం సిపిఐ పార్టీ సహాయ కార్యదర్శి గుడాల రాంబాబు , డి గోపి మరియు ఎన్ వి త్రినాథ్ మరియు గుడాల జయ మరియు సిరులు లక్ష్మీ బాలాజీ టీ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలలో ఇల్లు నిర్మాణం చేసుకున్న వారు ధరఖాస్తులు చేసుకోండి

- ఆర్డీఓ ఎం కృష్ణమూర్తి

విశాలాంధ్ర-టెక్కలి : ప్రభుత్వ స్థలాల్లో గత కొన్ని సంవత్సరాలుగా ఎవరైతే ఆక్రమించుకొని నివాసం ఉంటున్నారో అటువంటి వారికి ప్రభుత్వం పట్టా ఇచ్చే సదుపాయం కల్పించిందని అటువంటి వ్యక్తులు ఈ ఏడాది డిసెంబర్ 31 లోగా దరఖాస్తు చేసుకొని పట్టాలు పొందవచ్చని రెవెన్యూ డివిజన్ అధికారి ఎం కృష్ణమూర్తి వెల్లడించారు. గురువారం స్థానిక కార్యాలయంలో పత్రిక విలేకరుల సమావేశంలో మట్లాడుతూ 2019 అక్టోబర్ 15 కు ముందు నుంచి ఎవరైనా ఇల్లు లేని నిరుపేదలు ప్రభుత్వ స్థలాలని ఆక్రమించుకొని ఇల్లు నిర్మాణం చేసుకొని ఉంటే అటువంటి వారికి ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చేసి పట్టా ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం వారు దరఖాస్తు చేసుకోవాలని ఎటువంటి అబ్జెక్షన్ లేని స్థలాలు అయితే పట్టాలు ఇవ్వడం జరుగుతుంది అన్నారు. డివిజన్ లెవల్లో 150 గజాల వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని, 151 నుంచి 300 గజాల వరకు ఉంటే ప్రాథమిక అమౌంట్ తో రిజిస్ట్రేషన్ చేస్తామని అన్నారు. 300 గజాలు దాటి ఉంటే 50% రిజిస్ట్రేషన్ చార్జీలతో రిజిస్ట్రేషన్ చేయబడుతుందని, 450 గజాలు దాటి ఉంటే ప్రాథమిక స్థలం విలువ కి ఐదు రెట్లు ఎక్కువ చార్జ్ చేసి రిజిస్ట్రేషన్ చేయబడుతుందని అన్నారు. అయితే రిజిస్ట్రేషన్ మాత్రం మహిళల పేరు మీదే జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తాము ప్రభుత్వ స్థలాన్ని ఇన్ని సంవత్సరాలుగా అనుభవిస్తున్నట్లు నీటి పన్ను గాని, పంచాయతీ పన్ను గాని,కరెంట్ బిల్లు గాని ఎటువంటి పత్రాలు ఉన్న చూపించవలసి ఉంటుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇటువంటి సదా అవకాశాన్ని ప్రభుత్వ స్థలాల్ని ఆక్రమించుకున్న వారు వినియోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.